క్లుప్తంగా

కనుల పండువగా మల్లన్న కల్యాణోత్సవం



మల్లన్నస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తజనం

సైదాబాద్: కరణ్‌బాగ్‌లో పుట్టమన్నుతో స్వయంభువుగా వెలిసిన శ్రీమల్లికార్జున స్వామి కల్యాణాన్ని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. మల్లన్న జాతరను పురస్కరించుకొని విద్యుత్ దీపాలు, పూలతోరణాలతో ఆలయాన్ని అందంగా అలంకరించారు. ఆదివారం తెల్లవారుజామున స్వామి వారికి మేలుకొలుపు అనంతరం అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ గావించారు. మధ్యాహ్నం బలిజ మేడలాదేవి, గొల్ల కేతమ్మ సమేత మల్లన్నస్వామి కల్యాణాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. వేడుకల్లో సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతా రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్, ఆలయ కార్యనిర్వాహణాధికారి వీఎస్‌వీ సత్యనారాయణ పాల్గొన్నారు.

కాలనీలో రోడ్ల నిర్మాణం పూర్తి చేయిస్తా: ఎమ్మెల్యే



సాయినగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: నియోజక వర్గంలోని వివిధ ప్రాంతాల్లో మిగిలిపోయిన రోడ్ల నిర్మాణాలను వెంటనే చేపట్టేందుకు చర్యలు తీసుకుంటానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆటోసాయినగర్‌లో కాలనీవాసుల వినతి మేరకు ఆయన పర్యటించారు. కాలనీలోని సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గతంలో కాలనీలో అంతర్గత రోడ్లు నిర్మించారని, మరికొన్ని రోడ్లు నిర్మించాల్సి ఉందని వాటిని త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. మిగిలిన రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయిస్తానని కాలనీవాసులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

పోస్టర్ ఆవిష్కరణ



ఎల్‌బీనగర్: అయోధ్యలో రామ మందిర ప్రాణ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా బీఎన్‌రెడ్డినగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 22న ఉదయం నిర్వహించే శ్రీరామ తారకమహామంత్ర యజ్ఞం పోస్టర్‌ను కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీరాజరాజేశ్వరి శక్తిపీఠ జగన్మాత సేవకులు మెల్లూరి నవీన్‌శర్మ, ఆంజనేయ స్వామి ఆలయ చైర్మన్ రాజిరెడ్డి, కాలనీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, సోమిరెడ్డి పాల్గొన్నారు.



కందుకూరు: తిమ్మాపూర్‌లో ఇంటి ఎదుట రంగుల ముగ్గు వేస్తున్న మహిళ



పహాడీషరీఫ్: విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న కమిటీ సభ్యులు

భోగభాగ్యాల భోగి

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మహేశ్వరం నియోజకవర్గం వ్యాప్తంగా ఆదివారం భోగి పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయాన్నే ఆయా కాలనీల్లోని కూడళ్ల వద్దకు ప్రజలు చేరుకొని భోగి మంటలు వెలిగించారు. వివిధ ప్రాంతాల్లో ముగ్గులు పోటీలు నిర్వహించారు. చిన్నారులు, యువత పతంగులు ఎగిరేసి ఆనందాన్ని చాటుకున్నారు. పండగ సందర్భంగా గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

పహాడీషరీఫ్: మామిడిపల్లి బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొత్తం 44 మంది మహిళలు పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన లిఖిత, ఆధ్యలకు మిక్సీ, ట్రావెల్ బ్యాగ్.. ద్వితీయ స్థానంలో నిలిచిన శ్రీజకు డిన్నర్ బాక్స్, తృతీయ స్థానంలో నిలిచిన జ్యోత్స్నకు కుక్కర్‌ను స్థానిక కార్పొరేటర్లు యాతం పవన్ కుమార్ యాదవ్, సుక్క శివకుమార్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్ వాల్మీకి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పద్మశంకర్ గౌడ్, కృష్ణ, సహదేవ్, అశోక్ ముదిరాజ్, దాతలు వాసుదేవారెడ్డి, గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉదయమే స్వాగతం

కందుకూరు: మండల పరిధిలో భోగి పండగను ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. చిన్నా, పెద్ద ఉదయమే కూడళ్ల వద్ద భోగి మంటలు వేసుకుని పండగను స్వాగతించారు. మహిళలు, చిన్నారులు తమ ఇళ్ల ముంగిట ముగ్గులు వేసి అందంగా రంగులు అద్దారు. అనంతరం పిండి వంటలతో సంతోషంగా గడిపారు.

ముగ్గుల్లో గొబ్బెమ్మలు

తుక్కుగూడ: భోగి వేడుకలను మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాలలో ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మహిళలు తమ ఇంటి ఎదుట రంగులతో అందమైన ముగ్గులు వేశారు. వాటిలో గొబ్బెమ్మలను ఉంచారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. స్వామి వార్ల దర్శనానికి బారులు తీరారు.

ఎమ్మార్పీఎస్ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కందుకూరు: తెలంగాణ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 29న చేపట్టనున్న పోరు గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆ సంఘం సభ్యులు ఆదివారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మేడి మహేష్‌మాదిగ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంద రాజుమాదిగ మాట్లాడుతూ.. డప్పు, చెప్పు వృత్తిదారులకు పింఛన్లు ఇవ్వాలని, పారిశుద్ధ్య కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరారు. వచ్చే నెల 29న రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న బహిరంగ సభకు భారీ సంఖ్యలో మాదిగ, మాదిగ ఉపకులాలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహ, నాయకులు నరసింహమాదిగ, కృష్ణమాదిగ, జంగయ్యమాదిగ, నరసింహమాదిగ, యాదయ్య, సురేశ్ పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం



గెలుపొందిన నాగిరెడ్డిపల్లి జట్టుకు బహుమతి అందజేస్తున్న ఏసీపీ శ్రీనివాస్

- మహేశ్వరం ఏసీపీ శ్రీనివాస్
- ముగిసిన పెండ్యాల కబడ్డీ పోటీలు

మహేశ్వరం: ఆటలో గెలుపోటములు సహజమని, ఓటమి చెందిన వారు వెనుకడుగు వేయకుండా ముందుకు సాగాలని మహేశ్వరం ఏసీపీ బి.శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పెండ్యాలలో నవభారత్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. దీనికి ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల పట్ల చొరవ చూపాలన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసికోల్లాసం పెంపొందుతాయన్నారు. గ్రామంలో 24 ఏళ్ల నుంచి నవభారత్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సట్టి బాలకిష్టమ్మ జ్ఞాపకార్థం కుమారులు రామిరెడ్డి, లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, అంజిరెడ్డిల సహకారంతో పోటీలు నిర్వహించారన్నారు.

60 జట్లు పాల్గొనగా..

పోటీల్లో మొత్తం సుమారు 60 జట్లు పాల్గొన్నారు. ఫైనల్ పోరులో నాగిరెడ్డిపల్లి, రావిర్యాల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. విన్నర్‌గా నాగిరెడ్డిపల్లి, రన్నర్‌గా రావిర్యాల జట్లు గెలుపొందాయి. పాఠశాల విభాగంలో మొదటి బహుమతి కేశంపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ద్వితీయ బహుమతి వివేకనంద హైస్కూల్ మన్సాన్‌పల్లి జట్లు విజయం సాధించాయి. తాడు లాగుడు పోటీలో విన్నర్‌గా మహేశ్వరం జిమ్, రన్నర్‌గా పెండ్యాల జట్లు గెలుపొందాయి. విజేతకు రూ.30,000, ద్వితీయ స్థానానికి రూ.15 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో సీఐ ముని, నవభారత్ యూత్ క్లబ్ సభ్యులు, గ్రామస్తులు రాజేశ్, యాదయ్య గౌడ్, సంజీవరెడ్డి, రామకృష్టా రెడ్డి, హన్మంత్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, బాల్‌రాజ్, సుధాకర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వజ్రంరెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ యాత్ర విజయవంతానికి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న మేయర్ పారిజాత దంపతులు

బడంగ్‌పేట్: రాహుల్‌గాంధీ చేపట్టిన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' విజయవంతం కావాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ కార్పొరేటర్లతో కలిసి బడంగ్‌పేట్‌లోని కాశీబుగ్గ దేవాలయంలో ఆదివారం అభిషేకాలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకొని 1,116 కొబ్బరి కాయలు కొట్టారు. అనంతరం మేయర్ పారిజాత మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ చేపట్టిన యాత్ర ప్రజల ఆశీర్వాదంతో విజయవంతంగా పూర్తి కావాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, రామ్‌చందర్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి, బాలకృష్ణ, రాకేశ్, భాస్కర్‌రెడ్డి, కిరణ్, మహిళలు పాల్గొన్నారు.

మార్కెట్ పాలకవర్గం రద్దు జీఓ జారీ

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వం శనివారం రాత్రి జీఓ విడుదల చేసింది. ఈ సందర్భంగా మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్ మాట్లాడుతూ.. జీఓ రావడం వల్ల పాలకవర్గానికి వ్యక్తిగతంగా నోటీసులు ఇచ్చి వారి నుంచి ఫైళ్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కొత్త పాలకవర్గంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

సంతోషాల వేడుక

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే సబితారెడ్డి



మహేశ్వరం: సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే అచ్చ తెలుగు రైతు పండగ సంక్రాంతి అని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. భోగి మంటలు, రంగవల్లులు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలిపటాల సందళ్లు పండగను గుర్తు చేస్తాయన్నారు. ప్రజలందరూ కుటుంబంతో సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో రంగనాథుల కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న కాలనీవాసులు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంతిహిల్స్ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం గోదా రంగనాథుల కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు జిల్లెల మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు చంద్రబోస్, రఘునందన్‌లు నిర్వహించిన కల్యాణ క్రతువులో కాలనీకి చెందిన పలువురు దంపతులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జగాశ్‌రెడ్డి, కామేశ్వర్‌రావు, సుబ్రమణ్యం, రమేశ్ మహరాజు, యాదగిరిరావు, శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా 'ఐవీఎఫ్'



దుప్పట్లు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్ గుప్తా

చంపాపేట: అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) నిరుపేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఆదివారం వనస్థలిపురం వాసవి కల్యాణ మండపంలో ఫెడరేషన్ సభ్యుడు చింతల రజనీకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.ఫెడరేషన్ ఆధ్వర్యంలో పేద మెరిట్ విద్యార్థులకు సహాయ, సహకారాలు అందించడంతో పాటు పలు కాలనీల్లో ఉచిత వైద్య శిబిరాలు, పేద విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం శ్రీనివాస్ గుప్తా చేతుల మీదుగా పేదలకు దుప్పట్లు అందజేసి, ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ వెంకటేశ్వరరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీప్రసన్న, నాయకులు చంద్రశేఖర్, కట్ట రవి, ఫెడరేషన్ సభ్యులు భాగ్యలక్ష్మి, పాల్గొన్నారు.

యాదవ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నాగోలు: కొత్తపేట డివిజన్ మారుతీనగర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయనంద్ గుప్తా, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లింగాల నాగేశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్ని క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. యాదవ సంఘం నాయకులందరికీ భోగి పండుగ, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు శ్రీనివాస్ యాదవ్, కృష్ణ యాదవ్, గోపాల్ యాదవ్, సురేష్ యాదవ్, వెంకటేష్ యాదవ్, లింగాల నగేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

వసతుల కల్పనకు చర్యలు

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. ఆదివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో కాలనీ ప్రతినిధులతో కలిసి పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్ర నాయక్, ప్రవీన్, రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారికంగా జైపాల్‌రెడ్డి జయంతి, వర్ధంతి

ఆమనగల్లు: ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన దివంగత నేత సూదిని జైపాల్‌రెడ్డి జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల ఆమనగల్లు మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన సూదిని జైపాల్ రెడ్డి సేవలను గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 16న హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో జైపాల్‌రెడ్డి స్మృతివనం దగ్గర జరిగే జైపాల్‌రెడ్డి జయంతి వేడుకలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని మండ్లి రాములు కోరారు.

సీఎంకు కృతజ్ఞతలు

మాడ్గుల: ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత, దివంగత నేత సూదిని జైపాల్ రెడ్డి జయంతి, వర్ధంతి కార్యక్రమలను అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై మాడ్గుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చెరువు కట్టపై భారీ వ్యర్థాలు ...

రాకపోకలకు ఇక్కట్లు

- బాక్స్ డ్రెయిన్ నిర్మాణ కాంట్రాక్టర్ నిర్వాకం
- పనులు పూర్తయి రెండు నెలలైనా తొలగించని వైనం
- రోడ్డుపైకి దొర్లుతున్న రాళ్లతో వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని ఎస్ఎన్‌డీపీ అధికారులు



సరూర్‌నగర్ చెరువు కట్టపై భారీ బండరాళ్లతో కూడిన వ్యర్థాలు

సైదాబాద్: కాంట్రాక్టర్.. అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు ఇబ్బందులు పాలవుతున్నారు. బాక్స్ డ్రెయిన్ నిర్మాణం కోసం రహదారిని తవ్వగా వెలువడిన బండరాళ్లతో కూడిన వ్యర్థాలను చెరువు సుందరీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన కట్టపై పోయించి కాంట్రాక్టర్ చేతులు దులుపుకొన్నాడు. పనులు పూర్తయి రెండు నెలలు కావస్తున్నా... వ్యర్థాలను తొలగించకపోవడంతో చెరువు కట్టపై నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు వెంటనే చెరువు కట్టపై వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి ఆఫీసర్స్ కాలనీ నుంచి శంకేశ్వరబజార్ మసీద్ చౌరస్తా వరకు మొదటి దశ బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులను రెండేళ్ల క్రితం ప్రారంభించి ఇటీవలే పూర్తి చేశారు.
- ఎస్ఎన్‌డీపీ విభాగం అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పనుల్లో భాగంగా సరూర్‌నగర్ చెరువు కట్టకు ఆనుకొని ఉన్న శంకేశ్వర బజార్ కాలనీ రహదారిపై బాక్స్ డ్రెయిన్ నిర్మాణం కోసం రెండున్నర మీటర్ల వెడల్పు, రెండు మీటర్ల లోతుతో భారీ గుంతలు తీశారు.
- గుంతలు తీసే క్రమంలో వెలువడిన పెద్ద పెద్ద రాళ్లతో కూడిన వ్యర్థాలను కాంట్రాక్టర్ పక్కనే ఉన్న సరూర్‌నగర్ చెరువు కట్టపై వేయించాడు. ఆ వ్యర్థాలు రహదారి పక్కన ప్రమాదకరస్థితిలో పేరుకుపోయాయి.
- బాక్స్ డ్రెయిన్ నిర్మాణం పూర్తయిన తర్వాత వ్యర్థాలను అక్కడి నుంచి తరలించాల్సి ఉండగా, రెండు నెలలు కావొస్తున్నా ఇప్పటికీ వాటిని తొలగించలేదు.
- దాంతో నిత్యం చెరువు కట్టపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.ఒక్కోసారి కట్టపై నుంచి రాళ్లు దొర్లి కాలనీ రహదారిపై కూడా పడుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు.
- అనుకోని ప్రమాదం జరగక ముందే బండరాళ్లతో కూడిన వ్యర్థాలను తొలగించాలని పలువురు కోరుతున్నారు. ఆ దిశగా చర్యలు చేపట్టాలని ఆకాంక్షిస్తున్నారు.

త్వరలో తొలగిస్తాం



సరూర్‌నగర్ చెరువు కట్టపై పేరుకుపోయిన వ్యర్థాల వల్ల కాలనీలవాసులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కాలనీవాసుల ద్వారా సమస్యను గుర్తించాం. విషయాన్ని ఎస్ఎన్‌డీపీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అధికారులతో చర్చించి త్వరలో కట్టపై పేరుకుపోయిన భారీ వ్యర్థాలను తొలగిస్తాం.

–జంగం శ్వేతారెడ్డి
ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్

క్రీడలతో స్నేహభావం

మున్సిపల్ మాజీ చైర్మన్ భరత్‌కుమార్

ఇబ్రహీంపట్నం: క్రీడలు స్నేహ భావంతో పాటు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయని ఇబ్రహీంపట్నం మాజీ మున్సిపల్ చైర్మన్ కంబాలపల్లి భరత్‌కుమార్ అన్నారు. శేరిగూడ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్–4ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు యువతలో ఉత్తేజాన్ని, ఉత్సాహన్ని కలిగిస్తాయన్నారు. గెలుపోటములను అందరూ సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఈ ప్రారంభోత్సవంలో బీఆర్ఎస్ నాయకులు మోహన్‌రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ శంకర్, విద్యా కమిటీ చైర్మన్ సురేందర్, అంజయ్య, నిర్వాహకులు నరేష్ టిల్లు, పవన్ పాల్గొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ టోర్నమెంట్లో 8 జట్లు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో భరత్‌కుమార్, నాయకులు

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

తలకొండపల్లి: క్రీడలతో ఐకమత్యం పెరుగుతుందని సర్పంచ్ బక్కి కుమార్ అన్నారు. మండల పరిధిలోని చంద్రధన యూత్ ఆధ్వర్యంలో చంద్రధన ప్రీమియర్ లీగ్ (సీసీపీఎల్) క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం సర్పంచ్ కుమార్, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. సర్పంచ్.. గ్రామీణ ప్రాంతాల్లో ఈ క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.